

ఆలస్యం లేకుండా..

వైఎస్సార్ బీమా ఆర్తులను ఆదుకుంటోంది. ఆలస్యం లేకుండా పరిహారం అందిస్తున్నారు.

- 8లో



వాతావ'రణం'

జిల్లాలో చలి గాలులు పెరుగుతున్నాయి. వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు.

- 8లో

నేడు డయల్ యువర్ డీఎం

శ్రీకాకుళం క్రైమ్: డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం డిపో మేనేజర్-2 కేఆర్ఎస్ శర్మ తెలిపారు. పాతపట్నం, జలుమూరు, హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట, నరుబుజ్జిలి, ఆమదాలవలస ప్రాంతాల వారు అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9959225609కు కాల్ చేయాలని తెలిపారు.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న న్యాయవాదుల విధుల బహిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు వ్యతిరేకంగా జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యాయవాదుల విధుల బహిష్కరణ కార్యక్రమం కొనసాగిస్తామని, ఆ చట్టాన్ని వెనక్కి తీసుకునేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు తెలిపారు. సోమవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. అనంతరం బార్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బార్ కార్యదర్శి పొన్నాడ రాము, బీసీ న్యాయవాదులు సంఘం అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాదులు చమల్ల నర్సింహమూర్తి, రమణ్ దయాల్, అన్నెపు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కంటి వైద్యం కోసం రూ.2 లక్షల అందజేత



కంటి వైద్యం కోసం చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కోటబొమ్మాళి మండలం లఖందిడ్డి గ్రామానికి చెందిన కూటికుప్పల వెంకటరమణ, అతని సోదరి కూటికుప్పల జ్యోతి కంటి సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వీరు ఇటీవల పలాసలో సీఎం వైఎస్ జగన్‌ను కలిసి తమ కష్టాలను చెప్పుకున్నారు. తమకు ప్రతినెలా పెన్షన్‌తో పాటు, ఏదైనా అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. సీఎం ఆదేశాలతో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వీరి సమస్యపై స్పందించారు. వీరికి తిరుపతిలో కంటి శస్త్ర చికిత్సకు ఏర్పాట్లు చేసేందుకు చెరో రూ. లక్ష చొప్పున ఇద్దరికీ రూ.2 లక్షలు మంజూరు చేశారు. సంబంధిత చెక్‌ను కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఇద్దరికీ కలిపి అందజేశారు.

అచ్చెన్నాయుడు అనుచరుల భూ కబ్జాపై ఫిర్యాదు



టెక్కలి సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ వెంకటరమణమూర్తి

టెక్కలి: కోటబొమ్మాళి మండలం చిట్టివలస గ్రామంలో కింజరాపు అచ్చెన్నాయుడు, ఆయన సోదరుడు హరివరప్రసాద్ అనుచరుల చేతుల్లో అక్రమంగా ల్యాండ్ సీలింగ్ భూములు ఉన్నాయని, దీనిపై క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించాలని పంచాయతీ సర్పంచ్ సంపతిరావు వెంకటరమణమూర్తి టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు సోమ వారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 203-3బిలో గల సుమారు 1.64 సెంట్ల భూమిని గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూమిలేని నిరుపేదలకు ల్యాండ్ సీలింగ్ ద్వారా కేటాయించారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కింజరాపు అచ్చెన్నాయుడు, ఆయన సోదరుడు హరివరప్రసాద్ అనుచరులు అక్రమంగా ఆయా భూములను అనుభవిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లుగా సర్పంచ్ వెంకటరమణమూర్తి గుర్తు చేశారు. కోటబొమ్మాళి తహసీల్దారు దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ అక్కడ కనీసం పట్టించుకోవడం లేదని ఆయన వాపోయారు. దీనిపై సమగ్రంగా దర్యాప్తు నిర్వహించి అర్హులైన వారికి భూములు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విన్నవించారు.

మలి సంధె వేళాయె.. చలిగాలి వేణువాయె



నింగి నుదుట సిందూరంలా ఎర్రటి సూరీడు. అమ్మ ఒడిలో బిడ్డల్లా కదలి ఒడ్డున పడవలు. అలసిసొలసి తీరానికి చేరిన గంగపుత్రులను లాలించే నీటి ఊయలలు. పెదగనగళ్లవానిపేట సముద్ర తీరంలో సోమవారం సంధ్య వేళ ఆవిష్కృతమైన అద్భుత దృశ్యమిది. - శ్రీకాకుళం రూరల్

జగనన్న తోడు వాయిదా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న తోడు ఎనిమిదో విడత కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడిందని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 20న జరగాల్సిన కార్యక్రమాన్ని వాయిదా వేశామని, తదుపరి తేదీని త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు.

23 వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ చల్ల ఓబులేసు తెలిపారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో 7, ఆమదాలవలస మున్సిపాలిటీలో 3, పలాస, కాశీబుగ్గ 5, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో 8 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హతగల అభ్యర్థులు ఈ నెల 19వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇందులో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ వర్తిస్తుందని తెలిపారు. గ్రామవార్డుసచివాలయం.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మరింత చేరువ

- నేటి నుంచి ప్రతి ఇంటికీ ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీకి శ్రీకారం
- జిల్లాలో 6,61,400 కుటుంబాలకు కార్డుల జారీకి చర్యలు
- నేడు 40 సచివాలయాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ
- ఆరోగ్యశ్రీ, దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు



స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు లబ్ధిదారుకు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక

అరసవల్లి:

సామాన్యుడికి ఆరోగ్య శ్రీ సేవ మరింత చేరువ కానుంది. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొత్త స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయనుంది. తాజాగా ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రతి ఇంటికి ఆరోగ్యశ్రీ కొత్త స్మార్ట్ కార్డులు అందించే బృహత్తర కార్యక్రమాన్ని సోమవారం సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించారు. మంగళవారం నుంచి జిల్లాలో ఈ కొత్త స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నేడు 40 సచివాలయాల్లో కార్డుల పంపిణీ

జిల్లాలో మొత్తం 6,61,400 కుటుంబాలకు కొత్త కార్డులను అందించేలా ప్రణాళిక సిద్ధం కాగా, ఇప్పటివరకు జిల్లాకు 33,200 కార్డులు తొలివిడతగా అందాయి. ఇక మంగళవారం నుంచి రాష్ట్ర ఆరోగ్యశ్రీ విభాగం నుంచి నేరుగా జిల్లాలో 30 మండలాల ఎంపీడీఓలకు నేరుగా అందేలా చర్యలు చేపడుతున్నారు. ఇక జిల్లాలో 8 నియోజకవర్గాల్లో 5 సచివాలయాలు చొప్పున 40 సచివాలయాల్లో ఈ కార్డుల పంపిణీ మంగళవారం ఉదయం నుంచి ప్రారంభం కానుంది. దీంతో పాటు ఆరోగ్యశ్రీ యాప్‌ను ఇంటిలో కనీసం ఒకరైనా డౌన్‌లోడ్ చేసు కునేలా క్షేత్ర స్థాయి సిబ్బంది బాధ్యత తీసుకోనున్నారు. అలాగే దిశ యాప్ కూడా డౌన్‌లోడ్ చేయించేలా చర్యలు చేపట్టనున్నారు. ఇక వచ్చే నెల 1 నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష- ఫేజ్-2 కోసం అవగాహన కల్పించనున్నారు.



ఇదే కొత్త స్మార్ట్ ఆరోగ్య శ్రీ కార్డు

కోరుకున్న ఆస్పత్రిలో చికిత్స



ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చిన జబ్బుల నయం కోసం, రోగి తాను కోరుకున్న కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే ఉచిత వైద్యాన్ని, ఉచిత శస్త్ర చికిత్సలను చేయించేలా తాజా మార్గదర్శకాలున్నాయి. కొత్తగా ఆరోగ్య శ్రీ సేవలు స్మార్ట్ కానున్న నేపథ్యంలో ప్రతి ఇంటా వైద్య సిబ్బంది అవగాహన కూడా కల్పిస్తారు. గుండెజబ్బుతో పాటు క్యాన్సర్ వంటి అతిపెద్ద జబ్బులను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చిన సమాచారాన్ని క్షేత్ర స్థాయిలో తెలిసేలా విశదీకరిస్తారు. గతంలో ఈ ఆరోగ్యశ్రీ పరిధిలో 1,059 ప్రొసీజర్స్ ఉండగా, ఇప్పుడు ఏకంగా 3,257 వ్యాధులను (ప్రొసీజర్స్) ఈ పరిధిలోకి తీసుకొచ్చారు. 2019 నుంచి ఇప్పటి వరకు 2.35 లక్షల మందికి రూ.500 కోట్లకు పైగా విలువైన వివిధ రకాల శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారానే చేశారు.

యాప్ డౌన్‌లోడ్ తప్పనిసరి



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డును అర్హత ఉన్న కుటుంబాలకు కచ్చితంగా అందించాలి. ఇందుకు ఏఎన్‌ఎం, వలంటీర్లు కలిసి ఇంటికి ఒకరి ఫోన్‌లోనైనా ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలి. దీంతో ఆ ఇంట్లో ఎవరికి అనారోగ్యం కలిగినా వెంటనే ఏం చెయ్యాలో ఎలా ఎవరిని సంప్రదించాలో తెలుస్తుంది. దీంతో సమీపంలోని ఆస్పత్రులకు చేరుకుని వెంటనే చికిత్స పొందే అవకాశం ఉంది.

- డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్‌ఓ

క్యూఆర్ కోడ్‌తో ఆరోగ్యశ్రీ కార్డు



ఆరోగ్యశ్రీ పరిధి రూ.25 లక్షలకు పెరిగింది. అలాగే సరికొత్త సాంకేతికతతో యాప్‌ను, అలాగే క్యూఆర్ కోడ్‌తో కొత్త ఆరోగ్యశ్రీ కార్డు ప్రతి ఇంటికి చేరనుంది. ఇప్పటివరకు జిల్లాకు 33,200 కార్డులు చేరగా, నేరుగా ఇక మండలాలకే కార్డులు చేరనున్నాయి. సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటికీ ఈ కొత్త కార్డులను అందజేస్తారు. ఇక ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఇంటిలో సభ్యుల వివరాలతో పాటు సమీపంలో ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలన్నీ తెలుస్తాయి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

- డాక్టర్ ప్రకాశరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్

మహాకవి గరిమెళ్ల

- గరిమెళ్ల పేరిట పోస్టల్ స్టాంప్ విడుదల



పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోస్టు మాస్టర్ జనరల్ రాములు తదితరులు

పోలాకి(నరసన్నపేట): 'మా కొద్దీ తెల్ల దొర తనం' అంటూ బ్రిటిష్ వారి గుండెల్లో పాటల తూటాలు పేల్చిన మహాకవి గరిమెళ్ల సత్యనారాయణ అని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గరిమెళ్ల వర్ధంతి సందర్భంగా భారత ప్రభుత్వం పోస్టల్ స్టాంప్‌ను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరిమెళ్ల జీవిత విశేషాలను గుర్తు చేశారు. తపాలా శాఖ సౌజన్యంతో గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తపాలా శాఖ విశాఖ రీజియన్ పోస్టు మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు, తపాలా స్థానిక పర్యవేక్షణాధికారి పి.శ్రావణకుమార్, ట్రస్టు ప్రధాన కార్యదర్శి బాదాన రాజు, విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు వీజీకే మూర్తి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ ప్రత్యేక సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర శర్మ, హెచ్‌ఎం విశ్వేశ్వరరావులతో పాటు పలువురు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఐ.గణపతిరావు ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మంత్రికి సమస్యల విన్నపం



రైతు సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలోని జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని, జీడి బోర్డు ఏర్పాటు కోసం సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా జీడి రైతు సంఘ సభ్యులు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును కోరారు. వారు సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో సీదిరిని కలిసి సమస్యలు విన్నవించారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ సీఎంఓ కార్యాలయం అపాయింట్‌మెంట్ తీసుకుంటున్నామని, తీసుకున్న తక్షణమే మీకు సీఎస్‌తో చర్చలు జరిపేందుకు అవకాశం కల్పిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, ఏపీ కొబ్బరి రైతు సంఘం కో కన్వీనర్ సాతుపల్లి కృష్ణారావు, బత్తిని లక్ష్మినారాయణ, కుత్తుం వినోద్‌కుమార్, కోనేరు గురయ్యా, ఎంసీ వైస్ చైర్మన్ జినగ లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 290 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జేసీ నవీన్



సమస్య వింటున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 290 వినతులు వచ్చాయి. ఈ వినతులను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. ఆయనతో పాటు ఉప కలెక్టర్ జయదేవి, రెవెన్యూ డివిజనల్ అధికారి గణపతి రావు, డీఆర్‌డీఏ పీడీ విద్యా సాగర్ అర్జీలు స్వీకరించారు. అర్జీదారునికి ఇచ్చే సమాధానం పూర్తి వివరాలతో ఉండాలని జేసీ సూచించారు. జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్ ద్వారా, జగనన్నకు చెబుదాంలో 1902 నంబర్‌కు ప్రజలు సమస్యలను తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. సమస్యలను గడువులోగా పరిష్కరించాలని చెప్పారు.

పోలీసు స్పందనకు 29 అర్జీలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 29 అర్జీలు అందాయి. ఎస్పీ జీఆర్ రాధిక, సెబ్ అదనపు ఎస్పీ విజయనాగమణికంఠ, అదనపు ఎస్పీ (అడ్మిన్) జె.తిప్పేస్వామిలు అర్జీలు స్వీకరించారు. స్పందన ఫిర్యాదులు చట్ట ప్రకారం కచ్చితంగా పరిష్కరించాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు.

ప్రతి'ఫలాలివి'..

వజ్రపుకొత్తూరు మండలం చినడోకులపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పంటలు చేతికి అందుతున్నాయి. 22 మంది విద్యార్థులు ఉన్న ఈ బడిలో 'బడి తోట' అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి పలు పంటలు పండించారు. కొబ్బరి బొండాలు, కాయలు, అరటి గెలలు, సపోట పండ్లు, జామకాయలు వారానికి ఒక్కటి పండుతుండటంతో వాటిని పిల్లలే వాడుకుంటున్నారు.

-వజ్రపుకొత్తూరు రూరల్/కాశీబుగ్గ



బడితోటలో పండిన పంటను చూపుతున్న చిన్నారులు

వేడుకగా క్రిస్మస్ కేరల్స్



నగరంలోని డగ్లస్ స్కూల్ ఆవరణలో ఉన్న కీస్టోన్ చర్చి పాస్టర్ జోయల్ గోడి ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ కేరల్స్ వేడుకగా నిర్వహించారు. పాస్టర్ జోయల్ మాట్లాడుతూ 21వ తేదీన సాయంత్రం క్రిస్మస్ ర్యాలీ నిర్వహిస్తున్నామని, 23, 24, 25 తేదీల్లో క్రిస్మస్ సంబరాలు, 25న క్రిస్మస్ ఆరాధన జరుగుతుందని తెలిపారు.

-శ్రీకాకుళం కల్చరల్

'సమగ్ర భద్రతా ప్రణాళిక రూపొందించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో వచ్చే ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో, ఎన్నికల తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్ర భద్రతా ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడ రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి సోమవారం సాయంత్రం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడలో కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని కోరారు. శిక్షణ, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద రాష్ట్ర పోలీసు బలగాల అధికారులతో కలిసి భద్రతా పరమైన అంశాలు, ఏర్పాట్లపై ఎస్పీలు తగు సమగ్ర ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. అన్ని ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో కచ్చితమైన ప్రణాళిక, సమగ్ర సమీక్షలు నిర్వహించుకుంటే భవిష్యత్‌లో జరిగే ఎన్నికలను సజావుగా జరిగేలా చేయవచ్చని పేర్కొన్నారు. గడిచిన రెండు సాధారణ ఎన్నికల్లో మద్యం, నగదు, ఇతర బహుమతుల పంపకాల్లో నమోదైన కేసులను పరిశీలించాలని, వాటి ప్రవాహాన్ని అడ్డుకునే కచ్చితమైన ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. స్వాధీనం చేసుకునే నగదు, మద్యం, ఇంకా ఓటర్లను ప్రలోభపెట్టే ఎలాంటివి దొరికినా వెంటనే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితా వెలువడిన నాటి నుంచి ఇప్పటి వరకూ ప్రగతిని అంశాల వారీగా ఆయన అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధికతో కలసి మాట్లాడుతూ జిల్లా నుంచి రూపొందించిన సమగ్ర భద్రతా ప్రణాళికను గురించి వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిరంతర సాధనతోనే నైపుణ్యాలు



పోలీసుల పరేడ్ సాధన పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ తిప్పేస్వామి

ఎచ్చెర్ల క్యాంపస్: నిరంతర సాధనతోనే పోలీసుల్లో నైపుణ్యాలు మెరుగు పడతాయని జిల్లా అదనపు ఎస్పీ తిప్పేస్వామి అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీసులు సోమవారం ప్రత్యేక పరేడ్ సాధన చేశారు. ఈ సాధన పరేడ్‌ను అయన పరిశీలించారు. పోలీసులు విధుల్లో రాణించాలంటే దేహదారుఢ్యం, ఆరోగ్యం రెండూ కీలకమని చెప్పారు. యూనిఫాం సక్రమంగా ధరించటం, క్రమశిక్షణతో విధులు నిర్వహించటం, రోజూ శారీరక శ్రమకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో నాక్ బృందం పర్యటన



నాక్ బృందానికి స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ తదితరులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ బృందం సోమవారం పర్యటించింది. మంగళవారం కూడా బృందం సభ్యులు కళాశాలను పరిశీలిస్తారు. ఉదయం కళాశాలకు వచ్చిన నాక్ బృందం సభ్యులు ప్రవీణ అక్తర్ పండిట్, కృష్ణశర్మ, కృష్ణంరాజులకు ప్రిన్సిపాల్ పి.లత స్వాగతం పలికారు. అనంతరం కళాశాల్లో పర్యటించి కళాశాలపనితీరును పరిశీలించారు.

విద్యార్థులకు ప్రత్యేక ప్రీమియం షోలు



ఎస్‌వీసీ థియేటర్ వద్ద విద్యార్థులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని మూడు థియేటర్లలో సోమవారం పలు పాఠశాలల విద్యార్థులకు సైన్స్ మీద అవగాహన కోసం ప్రత్యేక సందేశాత్మక ప్రీమియం షోలు వేశారు. జాయింట్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు చిల్డ్రన్స్ ఫిల్మ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ఎగిసే తారాజువ్వలు' అనే బాలల చలన చిత్రాన్ని ఎస్‌వీసీ సినీ మ్యాక్స్, సూర్యమహల్, కిన్నెర థియేటర్లలో ప్రదర్శించారు. బాలలకు ఇచ్చిన టికెట్ల వారీగా మూడు థియేటర్లు కలిపి 1280 మంది విద్యార్థులు హాజరయ్యారు. టికెట్ల ద్వారా వచ్చే సొమ్మును ఫిల్మ్ ఫెస్టివల్ ఆర్గనైజర్ యు.వి. సంతోష్ ద్వారా జిల్లా సాక్షర భారతి సమితి, పలు సేవాకార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితుల ర్యాలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని ఆ సంస్థ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సనపల నర్సింహులు కోరారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా సోమవారం స్థానిక ఎన్జీఓ హోమ్ నుంచి జెడ్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జెడ్పీలో స్పందన హాల్ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర వెంకటరమణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, అగ్రి అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయ సింహా, రాష్ట్ర మహిళా కార్యదర్శి అరెలమ్మ, అసోసియేషన్ నాయకులు పీపీ రమణ, జె.గిరిబాబు, భాస్కర రావు, లక్ష్మీ నారాయణ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి కూరగాయలతో ఆరోగ్యం



ఎల్.ఎన్.పేట : ప్రకృతి వ్యవసాయ సాగు ఉత్పత్తుల విక్రయం

ఎల్.ఎన్.పేట, సారవకోట, కొత్తూరు, హిరమండలం: ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన కల్పిస్తూ ఊరూరా ఉత్పత్తుల విక్రయం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి సాగు విధానంలో పండించి ఉత్పత్తులను విక్రయించాడు. హిరమండలం, కొత్తూరులోనూ ఈ విక్రయాలను జరిగాయి. ఆయా మండలాల అధికారులు అక్కడ పాల్గొన్నారు. హిరమండలంలో బ్లాక్ రైస్, రెడ్ రైస్‌లను కూడా ప్రదర్శించి విక్రయించారు. ఈ ఉత్పత్తులతో తయారు చేసిన బిస్కెట్లను కూడా అమ్మకాలు జరిపారు. కొత్తూరులో సేంద్రియ పద్ధతిలో కషాయాలు, ద్రావణాలు తయారు చేయడంపై అవగాహన కల్పించారు.

ఆపత్కాలంలో
ఆలస్యం లేకుండా..

- వైఎస్సార్ బీమాతో సామాన్యుడికి ధీమా
- నాలుగు నుంచి ఎనిమిది రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ

పొందూరు: వైఎస్సార్ బీమా.. సామాన్యులకు ఆపత్కాలంలో అండగా నిలుస్తున్న పథకం. బీమా ప్రీమియం చెల్లించిన వారు మరణిస్తే అతి తక్కువ సమయంలో ప్రభుత్వం ఆ కుటుంబానికి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటోంది. ఈ క్లెయిముల చెల్లింపునకు అత్యాధునిక విధానాన్ని తీసుకువచ్చింది. ఇదివరకు బీమా కంపెనీలు పరిహారం చెల్లింపులో జాప్యం చేసేవి. ఇప్పుడు మాత్రం మరణం నమోదైన నాలుగు నుంచి పది రోజుల్లోపు అందాల్సిన బీమాను కుటుంబ సభ్యుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది.

గతంలో ఇలా...

గతంలో బీమా నగదు చెల్లింపులు ఆయా బీమా కంపెనీల పరిధిలో ఉండేవి. దీంతో లబ్ధిదారులు నెలల తరబడి పడిగాపులు కాసేవారు. లేనిపోని ఆంక్షలు పెడుతూ కాలయాపన చేసేవారు. గత ప్రభుత్వం బాధితుల పట్ల చిత్తశుద్ధి కనబరచకపోవడంతో బాధిత కుటుంబానికి ఆ నగదు అందడంలో ఆలస్యం అయ్యేది.

ప్రస్తుతం ఇలా..

పరిహారం అందించడంలో జాప్యాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గుర్తించి ఆ ప్రక్రియను సులభతరం చేసింది. ఈ అధికారాలు ప్రస్తుతం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీకి అప్పగించింది. దీంతో దరఖాస్తు కార్యాలయానికి చేరిన వెంటనే ఆ మొత్తాన్ని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నెల నుంచి వచ్చిన క్లెయిమ్‌లు తక్కువ రోజుల్లోనే విడుదల కావడంతో బాధితులకు వెంటనే న్యాయం జరుగుతోంది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను సుమారు నాలుగు రోజుల నుంచి పది రోజుల్లోనే 33 మందికి చెల్లించింది.



బీమా నగదును అందజేస్తున్న నాయకులు

బీమా ఇలా..

వయస్సు ఆధారంగా బీమా నగదు చెల్లింపులు ఉంటాయి. 18–50 ఏళ్ల మధ్య వయస్సు వారు కుటుంబ పెద్ద సాధారణ మరణిస్తే రూ. లక్ష, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షలు పరిహారం ప్రభుత్వం చెల్లిస్తోంది. అలాగే 18–70 ఏళ్ల లోపు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షలు, ప్రమాదవశాత్తు వికలాంగుడైతే రూ. 2.5 లక్షలు నుంచి రూ. 5 లక్షల వరకు పరిహారం చెల్లిస్తున్నారు. ఏటా జూలై 1 నుంచి జూన్ 30 వరకు క్లెయిమ్‌లు చెల్లిస్తారు.

పది రోజుల్లోనే పరిహారం వచ్చింది..



నా భర్త దళ్లి రాంబాబు ప్రమాదవశాత్తు మరణిస్తే ఒక్కసారిగా దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయాం. నా భర్త సంపాదనతోనే కుటుంబం గడిచేది. ఆయన మృతితో మాకు ఆధారం లేకుండా పోయింది. మరణానికి సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులకు అందించిన పది రోజుల్లోనే రూ. 5 లక్షలు నగదును అందించారు. ఇంత త్వరగా మా కుటుంబాన్ని ఆదుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మేం రుణపడి ఉంటాం.

– దళ్లి జ్యోతి, మృతుని భార్య, దళ్లిపేట

గత మూడేళ్లలో..				
సంవత్సరం	సహజ మరణాలు	ప్రమాదవశాత్తు మరణించిన వారు	ప్రమాదంలో వైకల్యం పొందినవారు	చెల్లించిన బీమా (రూ. కోట్లలో)
2021–22	1228	204	1	12.96
2022–23	1233	219	4	14.62
2023–24 (ఇప్పటి వరకు)	589	79	2	2.75

త్వరితగతిన క్లెయిమ్



గతంలో బీమా క్లెయిమ్‌ల చెల్లింపుల్లో చాలా ఆలస్యమయ్యేది. బీమా ప్రీమియం చెల్లించినా ప్రైవేట్ కంపెనీలు చిన్నచిన్న కారణాలతో జాప్యం చేసేవి. ప్రస్తుతం బీమా చెల్లింపులను ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని క్లెయిమ్‌లు వచ్చిన వెంటనే వారం రోజుల్లో పరిశీలించి లబ్ధిదారుల ఖాతాల్లో బీమా మొత్తాన్ని జమ చేస్తోంది.

– డాక్టర్ డి.విద్యాసాగర్, పీడీ, డ్వామా

టీవీ రిపేరు దుకాణంలో అగ్ని ప్రమాదం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలోని అయ్యప్ప గుడి వీధిలో ఉన్న టీవీ రిపేరు దుకాణంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరగగా రూ.లక్షన్నర వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. ఇంటి యజమాని గవర్రాజు తెలిపిన సమాచారం.. గవర్రాజు కుటుంబసభ్యులతో కలిపి దైవదర్శనం కోసమని ఇంటికి, షాపునకు తాళాలు వేసి శివాలయానికి వెళ్లారు. దర్శనం అనంతరం ఇంటికి వెళ్లే సరికి ఇంటిముందు ఉన్న దుకాణంలోనుంచి పొగ బయటకు వస్తోంది. స్థానికులు కోటబొమ్మాళి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. దీంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. ఈ లోగా విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ రామారావు విద్యుత్ సరఫరాను నిలిపివేవారు. లేదంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. షాపును తెరిచి చూడగా ఎలక్ట్రానిక్ సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. కోటబొమ్మాళి డిప్యూటీ తహసీల్దార్ ఆర్.మధు, ఆర్‌ఐ శివరామకృష్ణ, వీఆర్‌ఓ పేడాల అఖిల్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



కోటబొమ్మాళిలో అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న దుకాణం

ఆడవరం బడిలో శతక పద్యార్చన



విద్యార్థులతో సామూహిక పద్యార్చన నిర్వహిస్తున్న దృశ్యం

గార : మండలంలోని ఆడవరం ప్రాథమిక పాఠశాలలో శాంతి సద్భావన యాత్రలో భాగంగా శతక పద్యాల సామూహిక పద్యార్చన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ భోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో అమ్మ, నాన్న.. గురువుపై ఈ పద్యార్చన జరిగింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ వందేమాతరం పేరుతో వంద దేశాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆడవరంలో జరిగిందని, తెలుగులో పదిలక్షల మందితో ఒకే సారి చదివించడం గొప్ప విషయమని కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ రామకృష్ణారావు అన్నారు.

ప్రయాణికులకు బహుమతులు

శ్రీకాకుళం క్రైమ్: ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణం చేసి గిఫ్ట్ స్కీమ్‌లో ఎంపికైన ప్రయాణికులకు సోమవారం శ్రీకాకుళం 1, 2, డిపోల మేనేజర్లు మల్లికార్జున రాజు, కె.ఆర్.ఎస్.శర్మలు బహుమతులు అందజేశారు. డిసెంబరు 1 నుంచి డిసెంబరు 16 వరకు రెండు డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో ఆమదాలవలస, చీపురుపల్లి, బందరువానిపేట, సాలూరు, విజయనగరం, జీకేవలస, యరగాం, శ్రీముఖలింగం రూట్లలో ప్రయాణం చేసిన వారికి డ్రా తీయగా.. సాలూరు మార్గంలో ప్రయాణించిన వేణుగోపాల్ మధుసూదనరావు, చీపురుపల్లి మార్గంలో నారాయణరావు, బందరువానిపేట మార్గంలో డి.భువనేశ్వర్, జి.కె.వలసకు రామన్న, అశోక్, శ్రీముఖలింగంకు ఎం.వెంకటరమణ, గణేష్‌బాబు, జి.శంకర్‌లు ఎంపికయ్యారు. విజేతలకు జీఎస్‌వీ జ్యూయలర్స్ యాజమాన్యం దామోదరరావు, బోయిన పృథ్వీ, ఊన్న కిరణ్‌కుమార్‌లు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిపో సహాయ మేనేజర్లు రమేష్, శంకర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాయుడు, స్టేషన్ మేనేజర్ ఎం.పి.రావు, ఎస్‌డీఐ మూర్తి, పీఆర్వో సుమన్ పాల్గొన్నారు.



ప్రయాణికులకు బహుమతుల ప్రదానం

సేవాదళ్ జిల్లా, టీయూసీ అధ్యక్షుల నియామకం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షుల నియామకం చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన సోమవారం విడుదలైంది. ఈ మేరకు వైఎస్సార్ సీపీ సేవాదల్ జిల్లా అధ్యక్షుడిగా ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన మొదలవలస కృష్ణారావును, టీయూసీ అధ్యక్షునిగా శ్రీకాకుళం నగరానికి చెందిన సీపాన వెంకటరావులను నియమించారు.

మాట తప్పని నేత సీఎం జగన్

- సచివాలయ ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్:

మాట తప్పినవాడు చంద్రబాబునాయుడని, ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెరవేర్చిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గూడెం గ్రామంలో రూ.61.8 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల కేంద్రాలకు వెళ్లే పని లేకుండా గ్రామ సచివాలయం ద్వారానే అన్ని పౌర సేవలు అందుతున్నాయని, వీటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్లే ఇదంతా సాధ్యపడిందన్నారు.

ఆధునిక సాంకేతిక వినియోగించి భూముల రీసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ హయాంలో తుఫాన్లు, వరదలు వచ్చినపుడు పంట నష్టం అందించలేదని, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో వెంటనే పరిహారం అందిస్తున్నామని చెప్పారు. యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ పేదల ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ధర్మాన ప్రసాదరావును గెలిపించుకోవాలన్నారు. ఒక్క గూడెం గ్రామానికే సంక్షేమ పథకాల రూపంలో 25 కోట్లు అందించామన్నారు. మండలపార్టీ నాయకులు చిట్టి జనార్దనరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ గొండు కృష్ణ, ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్ప దివ్య, పీఏసీఎస్ గొండు కృష్ణ, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, పార్టీ నాయకులు గంగు నరేంద్రకుమార్, చిట్టి రవికుమార్, సాధు వైకుంఠరావు, అల్లు లక్ష్మీనారాయణ, సర్పంచ్ మట్ట గోవిందరాజు, ఎంపీటీసీ శర్వాణీ అప్పలరాజుపాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

సౌత్‌వెస్ట్ టోర్నమెంట్‌కు నీలిమ

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న డి.నీలిమ సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫెన్సింగ్ (మహిళలు) టోర్నమెంట్‌కు ఎంపికైంది. చిన్నకాకానిలోని ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో జరిగిన ఎంపికల్లో ప్రతిభ చూపడంతో ఆమెను ఎంపిక చేశారని శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వెంకటాచలం సోమవారం తెలిపారు. ఈ మేరకు నీలిమను అభినందించారు. ఈనెల 23 నుంచి 26వ తేదీల మధ్య ఎంజీఎం యూనివర్సిటీ ఔరంగాబాద్‌లో జరిగే పోటీల్లో నీలిమ పాల్గొంటుంది. అభినందన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కోటేశ్వరరావు, స్పోర్ట్స్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ జయరాజ్, స్పోర్ట్స్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నర్సింహమూర్తి, పీడి డాక్టర్ బి.గొరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిక పత్రాన్ని అందించి అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపక బృందం

పక్కాగా పది విద్యార్థుల డేటా

శ్రీకాకుళం న్యూకాలనీ:

పదో తరగతి విద్యార్థుల డేటా తయారీని పకడ్బందీగా చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే విద్యార్థుల పరీక్ష ఫీజుల చెల్లింపుల పర్వం దాదాపుగా పూర్తయ్యింది. పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను సైతం ప్రభుత్వం వెల్లడించింది. 2024 మార్చి 18 నుంచి జరిగే పరీక్షలకు జిల్లాలో ఇప్పటి వరకు 29,292 మంది ఫీజులు చెల్లించారు. జిల్లాలో 589 ఉన్నత పాఠశాలల్లో 27,660 మంది విద్యార్థులు రెగ్యులర్‌గా పదో తరగతి చదువుతుడగా, ప్రైవేటు(గతంలో ఫెయిలైనవారు)గా మరో 1632 మంది పరీక్ష ఫీజులు చెల్లించారు.

తప్పులకు మూల్యం తప్పదు..

మార్చి 18వ తేదీ నుంచి మొదలుకానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల డేటాతో పాటు వారి వ్యక్తిగత సమాచారం పక్కాగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అయితే భవిష్యత్‌లో విద్యార్థుల మార్క్స్ మెమోలో తలెత్తే తప్పులకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులే బాధ్యులని అధికారులు పేర్కొంటున్నారు. అందుకు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని పాఠశాల విద్యాధికారులు హెచ్చరిస్తున్నారు.

నామినల్స్ సవరణకు ఛాన్స్..

ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్స్ సవరణకు ప్రభుత్వం సన్నద్ధమైంది. దీంతో విద్యార్థుల వ్యక్తిగత సమాచారం ముఖ్యంగా విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, విద్యార్థి జన్మదినం, మీడియం, విద్యార్థి ఫొటో, సంతకం, ఆధార్‌కార్డు నంబర్, పుట్టుమచ్చలు, మొదటి, ద్వితీయ భాష, విద్యార్థి వైకల్యం, ఓఎస్ఎస్‌సీ సబ్జెక్ట్/కోడ్, తదితర సమాచారం పక్కాగా ఉండేలా చూడాలని పాఠశాల విద్య కమిషనర్ ఆదేశించారు. దీంతో ఒకవేళ పొరపాటున కంప్యూటర్‌లో డేటా నమోదు సమయంలో దోషాలు జరిగితే తప్పుల సవరణకు ఈనెల 20వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకు పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లో 'ఎడిట్' ఆప్షన్‌ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే పీహెచ్‌సీ విద్యార్థుల సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసిసిన కాపీని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంబంధిత సెక్షన్‌లో ఒరిజినల్, జిరాక్స్ కాపీలను ఈనెల 25వ తేదీలోగా తీసుకువచ్చి ధృవీకరించుకుని వెళ్లాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీనిపై డీఈఓ కె.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఒకటికి రెండు సార్లు సరి చూసుకుని డేటా నమోదు చేయాలని సూచించారు. టెన్త్ విద్యార్థులకు అన్యాయం చేయకూడదనే ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్ ఇచ్చిందని పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్ తెలిపారు.



పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

'ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివిధ కారణాలతో ప్రస్తుతం ఇంకా రెండు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, గతంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని కోరారు. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు పెన్‌డౌన్ చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు 20వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో సమ్మెకు దిగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యను సానుకూలంగా పరిష్కరించి వారికి మేలు చేసే నిర్ణయాన్ని తీసుకోవాలని వారు కోరారు.



వాతావ'రణం'

- జిల్లాను వణికిస్తున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- మిచాంగ్ తుఫాన్ తర్వాత పెరిగిన చలిగాలులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

మెళియాపుట్టి:

వాతావరణం జిల్లాపై రణం ప్రకటించినట్టు ఉంది. మిచాంగ్ తుఫాన్ తర్వాత ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో జనం చలితో వణుకుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. కనిష్ట ఉష్ణోగ్రతలతో వైద్య సిబ్బంది కూడా అప్రమత్తమవుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా ఆస్తమా, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులతో బాధ పడుతున్న వారు జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

గిరిజన ప్రాంతాల్లో..

జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో చలి గాలులు ఎక్కువగా వీస్తున్నాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు మంచులో తిరగకూడదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే ఆహార అలవాట్లు కూడా మార్చుకోవాలని చెబుతున్నారు. ఉదయం 9 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో మంచు తెరలు వీడకపోతుండడంతో దినవారీ కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోంది.



మెళియాపుట్టిలో కురుస్తున్న మంచు

చలికాలంలో పాటించాల్సిన జాగ్రత్తలు

- ఆస్తమా రోగులకు ఆయాసం రాకుండా ముందస్తుగా మందులు వేసుకోవాలి.
- ఏడాదిలోపు పిల్లలకు చలిగాలి తగలకుండా చూసుకోవాలి.
- ప్రయాణాల్లో చిన్నపిల్లల శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచాలి.
- విటమిన్ సి లభించేలా కూరగాయలు, పండ్లు తీసుకోవాలి. వాటి వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- వేడినీరు మాత్రమే తాగాలి.



రింపి గ్రామంలో ఇంటి వద్ద వృద్ధునికి వైద్యసేవలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

అవగాహన కల్పిస్తున్నాం



చలికాలంలో ఆరోగ్యం కోసం జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణంలో మార్పులతో గొంతు, ముక్కు ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే వైద్యుల సలహాలు తీసుకోవాలి. ఇప్పటికే గిరిజన గ్రామాల్లో పర్యటిస్తూ జాగ్రత్తలు చెబుతూ ఆరోగ్య సమస్యలపై మందుల పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్ రంధి గ్రీష్మ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు, మెళియాపుట్టి